హుజూరాబాద్‌టౌన్: సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న రెవరెండ్ నీహెచ్ సతీశ్‌కుమార్, పాల్గొన్న క్రైస్తవులు

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

కమాన్‌చౌరస్తా/హుజూరాబాద్‌టౌన్/వీణవంక , మార్చి 29 : జిల్లా వ్యాప్తంగా చర్చిల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక గీతాలు ఆలపిస్తూ, బైబిల్ పటిస్తూ ఆధ్యాత్మిక చింతనలో గడిపారు. పలువురు 40 రోజులుగా ఉపవాసం ఉండగా, దీక్షను విరమించి పేదలకు దాన ధర్మాలు చేశారు. బంధువులు, స్నేహితులకు బహుమతులు అందజేశారు. నగరంలోని పోలీస్ కమిషనరేట్ దగ్గర గల సీఎస్ఐ వెస్లి కెథిడ్రల్ చర్చి, క్రిస్టియన్ కాలనీలోని సీఎస్ఐ సెంటినరీ వెస్లీ చర్చి, విజయ రఘునందన్ రోడ్డులోని సెయింట్‌మార్క్ చర్చి, జ్యోతినగర్‌లోని లూర్జుమాత చర్చి, జగిత్యాల రోడ్డులోని బేతేలు చర్చి సందడిగా మారాయి. హుజూరాబాద్ పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో జరిగిన వేడుకల్లో సీఎస్ఐ చర్చి రెవరెండ్ చంద్రపల్కల సతీశ్‌కుమార్, చర్చి సెక్రటరీ సోల్లు బాబు, ట్రెజరీ అమర్లపుడి ప్రియాంక శరణ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వీణవంక, చల్లూరు, ఎలుబాక, నర్సింగాపూర్, ఘన్ముక్ల, వల్భాపూర్ గ్రామాల్లోని చర్చిల్లో ప్రార్థనల అనంతరం క్రైస్తవులు పరస్పరం గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

బీజేపీకి ఆరెపల్లి రాజీనామా

తిమ్మాపూర్, మార్చి 29: అసెంబ్లీ ఎన్నికల ముందు బీజేపీలో చేరిన మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ ఆ పార్టీకి రాజీనామా చేస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి లేఖను పంపారు. పెద్దపల్లి టికెట్ అడిగితే ఇవ్వలేదనే కారణంతో రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. తన రాజీనామాను ఆమోదించాలని కోరారు. తనతో కలిసి పనిచేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఆయన పలువురు నాయకులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

పన్నుల వసూలులో బల్దియా జోరు

కరీంనగర్ బల్దియా కార్యాలయం

- ఇప్పటి వరకు 80 శాతం వసూలు
- మరో రెండు రోజుల్లో ముగియనున్న ఆర్థిక సంవత్సరం
- ఆదివారం సెలవు రోజు సైతం పన్ను చెల్లింపుదారులకు అవకాశం

కార్పొరేషన్, మార్చి 29: కరీంనగర్ నగరపాలక సంస్థ ఆస్తి పన్నుల వసూలులో జోరు పెంచింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ పటిష్ట కార్యాచరణ చేపట్టగా, ఇప్పటి వరకు 80 శాతం మేరకు పన్నుల వసూలు పూర్తయింది. ఏటా 90 శాతానికి పైగా ఆస్తి పన్నులు వసూలవుతుండగా.. ఈసారి దానిని అధిగమించే లక్ష్యంతో అధికార యంత్రాంగం కృషి చేస్తున్నది. అయితే మరోవైపు ఈ ఏడాది పన్నుల వసూళ్ల విషయంలో ఉన్నతాధికారులు పెద్దగా దృష్టి సారించలేదన్న విమర్శలూ వస్తున్నాయి. మార్చి నెలలో మాత్రమే పూర్తి స్థాయిలో దృష్టి పెట్టి బిల్ కలెక్టర్‌పై వసూళ్ల కోసం ఒత్తిడి తీసుకువచ్చారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కరీంనగర్ నగరపాలక సంస్థకు ఏటా రూ. 39 కోట్ల మేరకు ఆస్తి పన్నులు రావాల్సి ఉంది. కాగా, ఈ సారి ఇప్పటి వరకు రూ.31.50 కోట్ల (80 శాతం) మేరకు వసూలయ్యాయని రెవెన్యూ అధికారవర్గాలు తెలిపాయి. అలాగే నగరపాలక సంస్థకు నగరంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల భవనాల నుంచి ఆస్తి పన్నుల రూపంలో భారీగానే బకాయిలు ఉన్నాయి. అయితే ఏటా ఆయా సంస్థలకు నోటీసులు ఇవ్వడమే తప్ప పెద్దగా వసూలయ్యే పరిస్థితి ఉండదు. కానీ, ఈ సారి బల్దియా ఉన్నతాధికారులు ఈ బకాయిలపై ప్రత్యేకంగా దృష్టి సారించడంతో గతంతో పోలిస్తే పన్నుల వసూలులో మంచి పురోగతి వచ్చిందని అధికారవర్గాలు చెబుతున్నారు. ప్రభుత్వ సంస్థల నుంచి బల్దియాకు రూ. 22 కోట్ల మేరకు బకాయిలు ఉండగా, ఈ సారి మాత్రం రూ.3.50 కోట్లకు పైగా వసూలు చేశారు. మరో రెండు రోజుల్లో మరిన్ని బకాయిలు వసూళ్లు అయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

ఒక్క రోజే రూ.35 లక్షలు వసూలు

ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు ఈ నెల 31న ఆదివారం అయినప్పటికీ పన్నులు చెల్లించే వారి కోసం నగరపాలక సంస్థ కార్యాలయం తెరిచే ఉంటుందని అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి రెవెన్యూ విభాగానికి చెందిన బిల్ కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు చెల్లింపుదారుల కోసం అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. పన్నులు చెల్లించే ఇంటి యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. శుక్రవారం ఒక్క రోజే నగరపాలక సంస్థకు రూ.35 లక్షల మేర పన్నులు వసూలైనట్లు అధికారులు వెల్లడించారు. ఇక శని, ఆదివారాల్లోనూ భారీగానే పన్నులు వసూలయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

నిత్యం ప్రమాదాలు జరిగే నల్లగొండ కమాన్ ప్రాంతం

ప్రమాదకర మలుపులు.. కనిపించని సూచికలు!

తిమ్మాపూర్, మార్చి 29: మండల వ్యాప్తంగా గ్రామాలకు వెళ్లే రోడ్లపై మూల మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. నుస్తులాపూర్ నుంచి మొగిలిపాలెం వరకు, రేణిగుంట నుంచి నేదునూరు వరకు, గుండ్లపల్లి నుంచి జూగుండ్ల వరకు వివిధ గ్రామాలకు వెళ్లే పంచాయతీరాజ్ రోడ్ల వెంట మూల మలుపులు, ఇతర ప్రమాదకర పాయింట్ల వద్ద సూచికల బోర్డులు ఎక్కడా ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే నుస్తులాపూర్ -నల్గొండ మార్గంలో నల్లగొండ కమాన్ వద్ద తరచూ యాక్సిడెంట్లు జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కడో ఓ చోట నామమాత్రంగా చిన్న బోర్డులు ఏర్పాటు చేయడంతో వాహనదారులకు అవగాహన లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇకనైనా అధికారులు రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల వాసులు డిమాండ్ చేస్తున్నారు.

టెట్ ఫీజు తగ్గించాలి

హుజూరాబాద్ టౌన్, మార్చి 29: ఉపాధ్యాయ అర్హత పరీక్ష 'టెట్' ఫీజు పెంపుతో నిరుద్యోగులపై పెనుభారం పడుతున్నదని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు తగ్గించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో తక్కువ ఫీజులతో పోటీ పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారని గుర్తు చేశారు. కానీ, ఎన్నికల హామీకి విరుద్ధంగా టెట్ పేపర్‌కు రూ.వెయ్యి, రెండు పేపర్లకు రూ. 2 వేల ఫీజు నిర్ణయించడం సరికాదని పేర్కొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జవ్వాజి విమల

రాజన్న సిరిసిల్ల, మార్చి29 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వంద రోజుల్లో అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు జవ్వాజి విమల విమర్శించారు. జీవనభృతి ₹4వేలు ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అర్హులందరికీ ₹4వేల పింఛన్ ఇస్తామని ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. పింఛన్ల కోసం అర్హులంతా ఎదురు చూస్తున్నారన్నారు. ప్రతినెలా పింఛన్లు కూడా సరైన సమయంలో ఇవ్వడంలేదని విమర్శించారు. గత ప్రభుత్వం ప్రతినెలా పింఛన్లు ఇవ్వడంతో వృద్ధులు, ఒంటరి మహిళలకు ఆసరా అయిందన్నారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, సకాలంలో పింఛను రాక పోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అభయహస్తం, మహిళా సంఘాలకు వడ్డీ పైసలు కూడా ఇంత వరకు విడుదల చేయలేదన్నారు. ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఐద్వా ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ సూరం పద్మ, వడ్ల లక్ష్మి, తదితరులు ఉన్నారు.

నీటిని విడుదల చేయకపోతే ఆందోళన తప్పదు

మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎడవెల్లి కొండల్‌రెడ్డి

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, పీఏసీఎస్ చైర్మన్ ఎడవెల్లి కొండల్‌రెడ్డి

హుజూరాబాద్‌టౌన్, మార్చి 29: నియోజకవర్గంలో రైతులు సాగు చేస్తున్న పంటలకు ఏప్రిల్ 15లోగా ఎల్ఎండీ నుంచి నీటిని విడుదల చేయాలని, లేకపోతే రైతులతో కలిసి పెద్దఎత్తున ధర్నాలు చేపడుతామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, పీఏసీఎస్ చైర్మన్ ఎడవెల్లి కొండల్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన పట్టణంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ పాలనలో కనిపించిన జలదృశ్యాలు కాంగ్రెస్ పాలనలో కనుమరుగయ్యాయన్నారు. నాడు మండుటెండల్లోనూ మత్తళ్లు పోసిన చెరువులు, నేడు మార్చిలోనే నోళ్లు తెరిచాయని పేర్కొన్నారు. అంతటా కరువుఛాయలు అలుముకొని పంటలు కండ్ల ముందే ఎండుతుంటే రైతులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో వరి చేనులు పొట్ట దశలో ఉన్నాయని, వచ్చే 15లోగా నీళ్లు ఇచ్చి వాటిని కాపాడాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులతో కలిసి హుజూరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా, జిల్లా కేంద్రంలోనూ పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇక్కడి పంటలను ఎండబెట్టి ఎల్ఎండీ నుంచి నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం వరకు సాగునీరు తరలించడాన్ని హుజూరాబాద్ నియోజకవర్గ రైతుగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సంగెం ఐలయ్య, సోషల్ మీడియా నియోజకవర్గ నాయకుడు తులసి లక్ష్మణ మూర్తి, సీనియర్ నాయకుడు పోరెడ్డి దయాకర్‌రెడ్డి తదితరులున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్

పార్టీకి మనమే బలం, బలగం

తిమ్మాపూర్, మార్చి 29: బీఆర్ఎస్ పార్టీకి నాటినుంచి యూత్ అండగా నిలబడిందని.. పార్టీకి మనమే బలగం, బలమని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. మండలంలోని నుస్తులాపూర్ గ్రామంలో యూత్ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న రోజుల్లో రాష్ట్రంలో ఒక్క ఎకరం కూడా ఎండిపోలేదని, నేడు ఎక్కడ చూసినా ఎండిపోయిన పొలాలు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలంటే రానున్న ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి యూత్ కార్యకర్త పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు రావుల రమేశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిరిసిల్ల జడ్పీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, బోయినపల్లి ప్రతీక్ రావు, యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో వర్క్‌షాపు

కరీంనగర్ రూరల్, మార్చి 29: నగునూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ జీ సమంత ఆధ్వర్యంలో 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ మ్యాథమెటిక్స్' అంశంపై ఒక రోజు ఆన్‌లైన్ వర్క్‌షాపు నిర్వహించారు. వక్సెన్ యూనివర్సిటీ హైదరాబాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శంకర్ రావ్ ముంజం ప్రత్యేక స్పీకర్‌గా హాజరై, విద్యార్థినులకు రోల్ ఆఫ్ మ్యాథమెటిక్స్ ఇన్ బేసిక్ సైన్సెస్ -2030 విజన్ గురించి వివరించారు. అలాగే గీతం యూనివర్సిటీ, హైదరాబాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పీ నర్సింహస్వామి అల్జీబ్రా, అప్లికేషన్‌పై, రాయిపూర్ నీట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ డాక్టర్ నీరజ్, డాక్టర్ ఎల్ భాస్కర్ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ సుష్మ, గణిత శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ పీ కవిత, వర్క్‌షాప్ కన్వీనర్ ఎన్ మునీంద్ర, ఫిజికల్ సైన్స్ విభాగం అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రార్థన మందిరాల్లో నీటి వితరణ

కలెక్టరేట్, మార్చి 29 : నగరంలోని ముస్లింలకు ప్రార్థనా మందిరాల్లో ఎంఐఎం ఆధ్వర్యంలో నీటి వితరణ చేస్తున్నట్లు పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ తెలిపారు. ప్రతి రోజూ 625 క్యాన్ల నీటిని ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. నెలరోజుల పాటు నిరాటంకంగా ఉచిత వితరణ కార్యక్రమం కొనసాగుతుందని వెల్లడించారు. వేసవి కాలం దృష్ట్యా ముస్లింలకు చల్లని తాగునీరు అందుబాటులో ఉంచే సంకల్పంతో నగరంలోని నాలుగు వాటర్ ప్లాంట్ల నుంచి ఉచితంగా సరఫరా చేస్తున్నట్లు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

సెస్ చైర్మన్ చిక్కాల పరామర్శ

నమస్తే తెలంగాణ కరీంనగర్ బ్రాంచ్ మేనేజర్, బ్యూరో ఇన్‌చార్జి ప్రకాశ్‌రావును పరామర్శిస్తున్న సెస్ చైర్మన్ చిక్కాల రామారావు

సిరిసిల్ల రూరల్, మార్చి 29: నమస్తే తెలంగాణ కరీంనగర్ బ్రాంచ్ మేనేజర్, బ్యూరో ఇన్‌చార్జి కడపత్రి ప్రకాశ్‌రావును సెస్ చైర్మన్ చిక్కాల రామారావు పరామర్శించారు. ప్రకాశ్‌రావు తల్లి సావిత్రిబాయి ఇటీవల మృతి చెందగా, శుక్రవారం తంగళ్లపల్లి మండలం చీర్లవంచ పరిధిలోని నాయినోరిపల్లెలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పడిగెల రాజు, జక్కుల రవీందర్ ఉన్నారు. అదే విధంగా బీజేపీ నేత గుజ్జుల రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పరామర్శించారు.

హన్మంతరావు మృతికి నివాళి

చొప్పదండి, మార్చి 29: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తండ్రి సీనియర్ న్యాయవాది మాకునూరి హన్మంతరావు మృతి చెందగా, పార్థివ దేహాన్ని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సందర్శించి నివాళులర్పించారు. ఎమ్మెల్యేను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

జగిత్యాలలో మాకునూరి హన్మంత రావు పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న సుంకె రవిశంకర్

లక్ష్మీపూర్‌లో సొసైటీ సర్వసభ్య సమావేశానికి హాజరైన రైతులు

మాట్లాడుతున్న అధ్యక్షుడు ముద్దసాని ప్రదీప్ రెడ్డి

సభ్యుల సహకారంతోనే సంఘం అభివృద్ధి

మానకొండూర్ రూరల్, మార్చి 29: సభ్యులందరి సహకారంతోనే సంఘం అభివృద్ధి బాటలో ముందుకు సాగుతున్నదని ఊటూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు ముద్దసాని ప్రదీప్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సంఘం సర్వసభ్య సమావేశం అధ్యక్షుడి ఆధ్వర్యంలో లక్ష్మీపూర్ గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న రోజుల్లో సంఘ పరిధిలో అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం తీసుకొచ్చిన బోనస్ రూ. 500 అందేలా సొసైటీ సభ్యుల ఆమోదంతో త్వరలో తీర్మానం చేయనున్నట్లు వెల్లడించారు. కొందరు రైతులు వివిధ సమస్యలను ప్రస్తావించగా, త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సొసైటీ పరిధిలోని పెట్రోల్ బంకును త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. అంతకు ముందు సొసైటీ సీఈవో మిట్టపెల్లి రవీందర్ వార్షిక నివేదికను సభ్యులను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎడ్ల సతీశ్ కుమార్, డైరెక్టర్లు, వివిధ గ్రామాల రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల అద్దె చెల్లించరూ..!

నగరంలో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

- కిరాయి ఇండ్లల్లో కేంద్రాల నిర్వహణ
- నెలల తరబడి పెండింగ్‌లో కిరాయి
- ప్రతి నెలా చెల్లించేందుకు కాంగ్రెస్ హామీ
- అధికారంలోకి వచ్చాక పట్టింపు కరువు
- సతమతమవుతున్న అంగన్‌వాడీ టీచర్లు

కలెక్టరేట్, మార్చి 29: 'అధికారంలోకి రాగానే అంగన్‌వాడీ కేంద్రాల సమస్యలు పరిష్కరిస్తాం... అద్దె భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాలకు ప్రతి నెలా సక్రమంగా కిరాయి చెల్లిస్తాం'.. ఇవి గత అసెంబ్లీ ఎన్నికల్లో నిర్వహించిన కాంగ్రెస్ ప్రచార సభలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు. అయితే అధికారం చేపట్టి 110 రోజులు గడిచినా హామీల అమలు దిశగా చర్యలేకపోవడం విమర్శలకు తావిస్తున్నది. ఇప్పటివరకు అద్దె చెల్లింపుపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో భవనాల యజమానులు టీచర్లపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తున్నది.

జిల్లాలోని నాలుగు అంగన్‌వాడీ ప్రాజెక్టుల పరిధిలో 777 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, వీటిలో 291 కేంద్రాలు సొంత భవనాల్లో, 231 ప్రైమరీ పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్నారు. మరో 255 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అద్దె భవనాలకు ప్రతి నెలా చెల్లించాల్సిన కిరాయి కేంద్రం నుంచి వచ్చే నిధులను బట్టి విడుదల చేస్తారు. అయితే, అలా కాకుండా తాము అధికారంలోకి వస్తే ప్రతి నెలా తాము కిరాయి చెల్లింపులు క్రమం తప్పకుండా చేస్తామంటూ అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభలో రేవంత్ రెడ్డి ప్రకటించగా, అద్దె భవనాల యజమానులతో పాటు అంగన్‌వాడీ టీచర్లు కూడా సంతోషపడ్డారు.

అటకెక్కిన హామీలు.. అంగన్‌వాడీల ఇక్కట్లు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఆ హామీ మాత్రం అటకెక్కడంతో, సీఎం తీరు ఏరు దాటినంక తెప్ప తగలేసినట్లుగా ఉందని కొంతమంది అంగన్‌వాడీ టీచర్లు బాహాటంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఆరు నెలల అద్దె పెండింగ్‌లో ఉండడంతో ఇండ్ల యజమానులకు సమాధానం చెప్పలేక సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యజమానుల ఒత్తిళ్లను భరించలేని కొంతమంది టీచర్లు తమ సొంత డబ్బులు చెల్లించి, అద్దె డబ్బులు విడుదలైన అనంతరం యజమానుల నుంచి తిరిగి తీసుకుంటున్నట్లు తెలుస్తున్నది. నామమాత్రపు అద్దె కూడా సక్రమంగా చెల్లించకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఇల్లు ఖాళీ చేయాలని గత రెండు నెలల నుంచి యజమానులు ఒత్తిడి తెస్తున్నట్లు అంగన్‌వాడీలు పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే అద్దె చెల్లించాలని అంగన్‌వాడీ టీచర్లు కోరుతున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

వీణవంక, మార్చి 29: మామిడాలపల్లిలో పేకాడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తిరుపతి శుక్రవారం తెలిపారు. వారి నుంచి రూ.11,930 స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, మార్చి 29: మామిడాలపల్లి మానేరువాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొన్నారు. ఎస్ఐ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన బొంగోని తిరుపతి, మామిడాలపల్లి గ్రామానికి చెందిన పురం శెట్టి రవీందర్ మామిడాలపల్లి మానేరువాగు నుంచి ఇసుకను అక్రమంగా కేశవపట్నానికి తరలిస్తుండగా, మామిడాలపల్లి గ్రామపంచాయతీ సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. వారిద్దరిపై కేసు నమోదు చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వెదిరలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

రామడుగు(చొప్పదండి), మార్చి 29: రామడుగు మండలం వెదిర జిల్లా పరిషత్ పాఠశాలలో 1991- 92 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు వేదికపై తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆనందం వ్యక్తం చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజ మౌళి, రిటైర్డ్ పీఈటీ దొడ్డ లచ్చిరెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు విజయలక్ష్మి, శైలజ, భారతి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న చిట్‌ఫండ్స్ అసోసియేషన్ సభ్యులు

చిట్‌ఫండ్ ఆధ్వర్యంలో అన్నదానం

విద్యానగర్, మార్చి 29: కరీంనగర్ జిల్లా ఆమోదిత చిట్ ఫండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతినెలా జరిపే అన్నదాన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కరీంనగర్ బస్టాండ్ ఎదురుగా 250 మందికి భోజనం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వావిలాల పల్లె అభయాంజనేయ స్వామి ఆలయ అధ్యక్షుడు మధుసూదన్ రావు హాజరుకాగా, శ్రీ చిట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం, సిబ్బంది, అసోసియేషన్ అధ్యక్షులు పెంట శ్రీనివాస్, కార్యదర్శి చీటి సత్యనారాయణ రావు, కోశాధికారి అల్లంకి రంజిత్ కుమార్, ముఖ్య సలహాదారు కొండ వేణుమూర్తి, కోమల్ రెడ్డి, రొంటాల రాంరెడి, శ్రీనివాస్, రాజిరెడ్డి, సుభాష్ పాల్గొన్నారు.

వడ్లూరి తిరుపతికి డాక్టరేట్

వడ్లూరి తిరుపతి

కమాన్‌చౌరస్తా, మార్చి 29: కరీంనగర్ మండలం చెర్లబూత్కూర్ గ్రామానికి చెందిన వడ్లూరి తిరుపతికి ఉస్మానియా యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో డాక్టరేట్ ప్రకటించింది. శ్రేయాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే సాగర్ పర్యవేక్షణలో 'స్కేలబుల్ డేటా ఎన్క్రిప్షన్ అండ్ రీడైరెక్షన్ ఆఫ్ క్లైంట్స్ ఇన్ లార్జ్ స్కేల్ డిస్ట్రిబ్యూటెడ్ ఐవోటీ నెట్ వర్క్ త్రు ఎంక్యూటీటీ ప్రొటోకాల్' అంశంపై ఆయన పరిశోధన చేసి నివేదిక సమర్పించారు. ఈ క్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది.

సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలి

- ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటి

సిరిసిల్ల, మార్చి 29: సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకటి కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఎస్సీ, ఎస్